# 'మేడ్ ఫర్ యు'

– ఆకెళ్ళ శివప్రసాద్

**కొడైకెనాల్ ఒంటరిగా రావడమంత బుద్ధి తక్కువ పని యింకోటి లేదనుకున్నాడు ప్రవీణ్. హనీమూన్ స్పాట్‌కి హాని అందించే వ్యక్తి లేకుండా రావడమేమిటి?**

**తనని తాను తిట్టుకోకూడని తిట్లని తిట్టుకున్నాడు.**

అంతా హడావిడిగా అయిపోయింది.

హఠాత్తుగా రాష్ట్రం కాని రాష్ట్రానికి అందులోను యిక్కడికి వెళ్ళమంటారని కల కన్నాడా?

కలకంటే, ఇలని స్వర్గంలా చేస్తున్న, తన చిలకల కొలికిని కోనసీమ నడిబొడ్డులో ఉన్న పుట్టింటికి అంతక్రితం రోజే పంపేవాడా?

పెళ్ళయిన మూడు నెలల కాలం తెలీకుండా కరిగిపోయింది. చుంబనాల సరిగమలతో, కౌగిలింతల కవ్వింపులతో, ఆరోజూ, అలా గడిచిపోతున్న క్షణంలోనే ఆవిడెవరికో కాలం చెల్లిందన్న, టెలిగ్రామ్ చీరనే లుంగీలా చుట్టుకుని అందుకున్నాడు.

ఆవిడ తన భార్యకి పిన్ని కావడంతో, చిన్నప్పుడు రెండు జెడల లగాయితు పెద్దయనకా స్టెప్స్ వచ్చే పట్టుచీర కట్టుకోవడం ఆవిడే నేర్పడంతో వూరికి పంపక తప్పింది కాదు.

ఆ మర్నాటి మధ్యాహ్నామే క్యాంప్‌కి వెళ్ళాలని బాస్ చెప్పాడు. ఒంటికాయ సొంటికొమ్ములా, యింట్లో దిండుని నలిపేస్తూ పడుకునే బదులు వెళ్ళడమే మంచిదనుకున్నాడు.

క్యాంప్ అంటే 'యస్' అన్నాడేకానీ ఎక్కడికో అడగలేదు.

'కొడైకెనాల్' అంటూ వచ్చింది మేనేజర్ స్టెనో పై పెదవితో నవ్వుతూ, కింది పెదవితో వెక్కిరిస్తూ.

అరగంట క్రితమే ఆ ఆంగ్లో ఇండియన్ స్టెనోకి ఓ విరహగీతం వినిపించడమే కాకుండా, ఆమె మొహంల్లోకి చూస్తూ టన్నుల విరహాన్ని కురిపించడం జరిగింది.

క్యాంప్ లెటర్ ఇస్తూ–

"ఓ రెండు రోజుల ముందు వచ్చివుంటే, ఈ క్యాంప్ మరో హనీమూన్ అయ్యేది..." అంది.

మరోసారి అయితే మరో హనీమూన్ ఏమిటి, రోజూ హనీమూన్ అనేవాడు. యిప్పుడు ఆ 'మూడ్'లో లేడు మనిషి.

మద్రాసు వరకు రైలులో వెళ్ళి, అక్కడ్నించి కొడైకెనాల్ వెళ్ళాలి. ఎమర్జెన్సీ కోటాలో లక్కీగా బెర్త్ దొరికింది.

ఎదురుగా ఉన్న సైడ్ సీటు వాళ్ళకి ఆర్‌ఏసి దొరికింది. యిద్దరు సీట్లని వాల్చుకుని కూర్చున్నారు. ఓ రాత్రివేళ లేచిచూస్తే చిలకా గోరింకల్లా ఒకరిలో ఒకరు ఒకే సీటులో ఒదిగిపోయి పడుకున్నారు.

'అదృష్టవంతులు' అనుకున్నాడు.

ప్రయాణంలో యిక నిద్రపట్టలేదు. ఆ సీటు వాళ్ళు ఏమేం చేస్తున్నారనే ధ్యాస.

మద్రాసులో దిగి బస్సు ఎక్కాడు. అందరూ పదుముచ్చు జంటలే. ఒంటరిగా బస్సు ఎక్కుతుంటే ముదిరిన బెరడకాయని చూసినట్టు ఓ అమ్మాయికి ఫక్కున నవ్వింది.

కొడైకెనాల్ చేరాక గెస్ట్‌హౌస్‌కి వెళ్ళాడు. అక్కడ్నించి డైరెక్ట్‌గా బ్రాంచీకి వెళ్ళాడు. మధ్యాహ్నం మూడు అయ్యేసరికి పని పూర్తయ్యింది.

కాసేపు అక్కడే గడిపాడు.

నాలుగు గంటలకి ఎక్కడి వాళ్ళు అక్కడికి వెళ్ళిపోవడం ప్రారంభించారు.

చివరగా క్లర్క్ వెళ్తూ–

"సార్... మీకు మ్యారేజి కాలేదా?" అని అడిగాడు.

"అయ్యింది..." అన్నాడు ప్రవీణ్ పొడిగా.

"అయిందా?.." ప్రపంచంలో తొమ్మిదో వింతని చూస్తున్నట్టుగా చూసి, నవ్వి 'బై' అని వెళ్ళిపోయాడు.

ప్రతివాడికి తనమీదే దృష్టి ఎందుకో అనుకున్నాడు.

కొడైకెనాల్‌లో ఉన్న స్పాట్స్ అని చుట్టిరావొచ్చు. డ్రైవర్‌తో చెప్తే క్షణాలమీద తిరగొచ్చు. కానీ డ్రైవర్‌గా అప్రాచ్యపు చూపు చూస్తే–

అయినా స్పాట్స్ చూసి మాత్రం ఏం చేస్తాడు.

'టెంపరేచర్' పెంచుకోవడం తప్ప.

రెండు అరచేతులు రాపిడి చేసుకున్నాడు. వేడి పుట్టింది.

స్థల మహాత్మ్యం అంటే యిదేనేమో అనుకున్నాడు.

సన్యాసులు కూడా యిక్కడికి వస్తే తంబురా వగైరాలు వదిలేసి 'దమ్మారో దమ్' అంటూ రక్తిగీతాలు ఆలపిస్తారేమో!

గెస్ట్‌హౌస్ వరకు నడుచుకుంటూనే వెళ్ళదామని నిర్ణయించుకుని డ్రైవర్ని పంపేశాడు.

దారిలో...

అందమైన పంజాబీ జంట... ఒకరి భుజాల మీద మరొకరు చేతులు వేసుకుని దగ్గరగా, అతిదగ్గరగా, గాలి కూడా ప్రవేశించడానికి వీలులేనంత దగ్గరగా అనుకుని నడుస్తున్నారు.

నడుచుకుంటూ 'లేక్' దగ్గరికి వచ్చాడు...

జీన్స్‌లో ఉన్న అమ్మాయిని షార్ట్స్ ఉన్న అతను మరీ మొహమాట పెట్టి బోట్ ఎక్కిస్తున్నాడు...

బోటులో జంటలు ప్రపంచాన్ని మర్చిపోతున్నాయి...

అక్కడ్నుంచి ముందుకు నడిచాడు...

గెస్ట్‌హౌస్‌కి ఎత్తుగా ఉన్న మలుపు తిరగాలి...

సాయంత్రం పూల పరిమళాలు, యూకలిప్టస్ చెట్ల సువాసనలతో కలిసి వస్తున్నాయ్...

చలిగా వుంది...

ముచ్చటగా వుంది....

మలుపు తిరిగాడు...

ఓ పెద్దచెట్టు చాటు నుంచి కిలకిలలు వినిపించాయ్... అటు చూశాడు. నవ్వుతున్న ఓ అమ్మాయి మీదకి వొంగి రెండు పెదాలని చటుక్కున నమిలినంత పనిచేశాడు ఓ అబ్బాయి.

తను యింతకన్నా ఎక్కువ అమృతాన్నే జుర్రుకున్నాడు...

పెళ్ళయిన వెంటనే ఊటీ వెళ్ళాడు... అక్కడి అణువణువుకీ తను, 'సునీత' చేసిన చిలిపి చేష్టలు, ముద్దు ముచ్చటలు తెలుసు...

నీరసంగా అనిపించింది.

నవరసాల్లోని అపురూప రాగం శృంగారం కరువైతే నీరసం కాక ఉత్సాహం వస్తుందా?

"సార్" అన్న పిలుపు వినిపించిన వైపు చూశాడు.

వాడెవడో చేతిలో ఏవో ప్యాకెట్లు పట్టుకుని ఉన్నాడు.

"శక్తి సార్... డల్ రాదు.. అలుపు వుండదు..." అంటూ రెచ్చిపోతున్నాడు హిందీ, ఇంగ్లీషులు కలిపి.

వాడతను ఎవర్నో తీసుకొచ్చాడని భ్రమలో వున్నట్టున్నాడు. ఓ పట్టాన వదిలి పెట్టలేదు.

మెల్లగా నడుచుకుంటూ గెస్ట్‌హౌస్‌కి వస్తుంటే-

"హమ్ తుమ్ ఏక్ కమరేమే బంద్ హో" పాట లీలగా విన్పిస్తోంది.

అదేవిటి తను హనీమూన్‌లో పాడాడు. సునీత చేత బలవంతాన షార్ట్స్ వేయించి మరీ.

'ఛ' అనుకున్నాడు.

వాచ్‌మెన్ 'సలాం సార్' అన్నాడు.

నడివయస్కుడు.. తనకి భోజనం తెచ్చి వెళ్ళిపోతాడు...

తనకి కావలసినవన్నీ అందిస్తానని వాడు ప్రొద్దున్నే చేసిన వాగ్దానం ఎందుకో గుర్తొచ్చింది...

ఏడు గంటలకి అర్ధరాత్రి అయిపోయినట్టుగా ఉంది.

మీల్స్ తెచ్చాక-

"ఔర్ మేచ్ హోనా సార్?" అని అడిగాడు.

మెల్లగా నవ్వాడు ప్రవీణ్.

'క్యా సాబ్' అంటూ దగ్గరకి వచ్చాడు. ప్రవీణ్ యిబ్బంది పడుతున్నట్టు మొహం పెట్టాడు.

'బోలో సాబ్' అన్నాడు రెచ్చగొడ్తున్నట్టు.

అటుగా వెళ్తున్న జంటవైపు చూపుడువేలు చూపెట్టాడు.

విషయం అర్ధమైనట్టు మెల్లగా నవ్వి-

'జరూర్ సాబ్' తన చేతిలో ఉన్న పని అన్నట్టుగా చిటికె వేసి కదిలాడు.

అప్పటిదాకా పేరుకుపోయిన నిరుత్సాహం ఎగిరిపోయింది.

హీటర్ ఆన్ చేశాడు.

వేడినీళ్ళు పోసుకున్నాడు.

వళ్ళంతా తేలిక పడింది.

పౌడర్ అద్దుకున్నాడు.

పర్‌ఫ్యూమ్ చల్లుకుని, బెడ్ మీద స్ప్రే చేశాడు.

ఆఫీసు డ్యూటీ చేసిన డ్రెస్సు దూరంగా విసిరాడు.

పెట్టెలోంచి లుంగీ తీసుకుని కట్టుకున్నాడు.

చలిగా అన్పించి, రెండు చేతులు రాపిడి చేసుకున్నాడు.

లాల్చీ వేసుకుంటే బాగుండును అన్పించింది.

పెట్టె అడుగున లాల్చీని బైటకులాగి, మడత విప్పితే ఢనమంటూ ఏదో పడింది.

షాక్ తగిలినట్టుగా ఆగిపోయాడు.

అది- భార్య సునీత ఫొటో. నవ్వుతూ వుంది.

ఆ నవ్వులో అమాయకత, లాలన కలిసి వున్నయ్.

ఫొటో యధాలాపంగా వెనక్కు తిప్పాడు-

'మేడ్ ఫర్ యూ-. మ్యాడ్ ఫర్ యూ' అని వుంది.




సరిగ్గా అప్పుడు కాలింగ్ బెల్ మోగింది.

అది మోగుతూనే వుంది, సునీత ఫొటోని గుండెకి హత్తుకున్న ప్రవీణ్ కదిలే ప్రయత్నం ఏమాత్రం చేయడం లేదు!!